క్లుప్తంగా

పరామర్శ


సత్యంనాయుడు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య, తదితరులు

దత్తిరాజేరు: మండలంలోని టి.భూర్జవలసలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నడుపూరి సత్యంనాయుడు ఇటీవల మృతి చెందారు. ఆదివారం ఆయన పెద్దకర్మ కార్యక్రమానికి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హాజరయ్యారు. సత్యంనాయుడు కుమారుడు విజయనగరం పీటీసీ సీఐ వేణుగోపాల్, ఇతర కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.ఎమ్మెల్యే వెంట సర్పంచ్ మంత్రి క్రాంతికుమార్, ఎంపీటీసీ అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు రాపాక కృష్ణమూర్తి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు మండల శ్రీను, సీనియర్ నాయకులు మజ్జి అప్పలనాయుడు ఉన్నారు.

పెరియార్ జయంతి


జోహార్ పెరియార్ అని నినాదాలు చేస్తున్న సమాజ్‌వాది పార్టీ నేతలు

జామి: మండల కేంద్రంలో బహుజన సమాజ్‌వాది పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గాలి చైతన్య కుమార్ ఆధ్వర్యంలో సంఘసంస్కర్త ఈ.వి.రామస్వామి (పెరియార్) జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెరియార్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అజ్ఞాన, అణచివేత, మూఢ విశ్వాసాలకు పెరియార్ రామస్వామి ఆగర్భశత్రువని అన్నారు.ఆయన ఆశయాలు,ఆలోచనలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సమాజ్‌వాది పార్టీ నాయకులు సీహెచ్.ఎర్నిబాబు, కె.కొండమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అచ్చారావుకు ఘన నివాళి


అచ్చారావు చిత్రపటంవద్ద నివాళులర్పిస్తున్న దళితనేతలు

వేపాడ: దళిత నేత తాడి అచ్చారావు వర్ధంతిని మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏపీ దళిత కూలీ రైతు సంఘం, మాలమహానాడు మండల శాఖ ఆధ్వర్యంలో ఆది వారం నిర్వహించారు.అచ్చారావు చిత్రపటానికి దళిత కూలీ రైతుసంఘం, మాలమహానాడు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద, బడుగు,బలహీన వర్గాలకు అచ్చారావు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఏపీ దళితకూలీ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టా కాశీవిశ్వనాథం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాలి ఈశ్వరరావు, రాష్ట్ర సభ్యులు పాటకాసు, మండల మాలమహానాడు అధ్యక్షుడు దేబార్కి కిరణ్, సభ్యుడు చెలికాని బంగారయ్య, మాజీ సర్పంచ్ దేబార్కి అప్పారావు, వార్డు మెంబర్ మిరపాక రమణ, వేపాడ, వల్లంపూడి జైభీమ్ యూత్‌సభ్యులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పుట్టినరోజు వేడుకలు


వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నేతలు

శృంగవరపుకోట: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టినరోజు వేడుకలను స్థానిక బీజేపీ నాయకులు పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ భారత్‌ను విశ్వగురుగా నిలబెట్టి ప్రపంచంలో దేశ ఖ్యాతిని మోదీ పెంచారన్నారు. మేక్ ఇన్ ఇండియా, కిసాన్ సమ్మాన్, స్వచ్ఛభారత్, ఆయుష్మాన్‌భారత్ వంటి పథకాలతో పేదరిక నిర్మూలన కోసం పనిచేస్తున్నారన్నారు. నాయకులు డి.సూర్యారావు, డి.దాశరథి, ప్రసాద్,భూపతిరావు,అప్పారావు, రవి, పార్వతీదేవి, చంద్రశేఖర్ జగన్నాథం, వి.ఈశ్వరరావు బి.అప్పారావు పాల్గొన్నారు.

బహుళ పంటలతో అధిక ఆదాయం

బొండపల్లి: ప్రకృతి వ్యవసాయం విధానంలో తక్కువ విస్తీర్ణంలో బహుళ పంటలను సాగు చేయడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయమెంటర్ కాసులమ్మ అన్నారు. బహుళ పంటల సాగువిధానంపై ఎం.కొత్తవలసలో గ్రామస్తులతో పాటు, విద్యార్థులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాయలసీమలో రైతులు ఈవిధానంలో కూరగాయలు,తీగ,పప్పు,దుంప జాతుల పంటలు సాగుచేస్తూ 20 సెంట్ల విస్తీర్ణానికి నెలకు రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు ఏడాదంతా ఆదాయం సంపాదిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు,హెచ్‌ఎం రామారావు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు


చీపురుపల్లి: విశ్వకర్మ జయంతి వేడుకల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, నాయకులు


గజపతినగరం: విశ్వకర్మ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య


కొత్తవలస: జిందాల్ కర్మాగారం ఆవరణలో విశ్వకర్మ మండపంలో పూజలు

చీపురుపల్లి: పట్టణంలోని లావేరురోడ్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, విశ్వబ్రాహ్మణ సేవా సంఘం సమక్షంలో శ్రీ విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో అంతటా వేడుకలు నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి జెడ్పీ చైర్మన్ పూలమాలలు వేసి పూజలు చేశారు. ప్రజలందరికీ విశ్వకర్మ ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. గుర్ల జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల విశ్వేశ్వరరావు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, బెల్లాన త్రినాథరావు, సువ్వాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.


కొత్తవలస: కొత్తవలస రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విశ్వకర్మ విగ్రహం


శృంగవరపుకోట: ఎస్.కోటలో పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

గజపతినగరంలో..

గజపతినగరం: శ్రీవిరాట్ విశ్వ కర్మ భగవాన్ జయంతి వేడుకలను గజపతినగరం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మచిత్ర పటానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి పూజలు చేశారు. జెడ్పీటీసీ గార తవుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు బూడి వెంకటరావు, సీనియర్ నాయకులు బెల్లాన త్రినాథరావు,కరణం ఆదినారాయణ, నాయకులు మండల సురేష్, రేగ సురేష్, ఎస్.పైడిరాజు, కె.నానాజీ, గడసాం రమణ, నాయుడు, గురుగుబిల్లి సత్యనారాయణ, న్యాయవాది పి.శ్రీనివాసరావు,మోహన్‌రావు పాల్గొన్నారు.

జిందాల్ కర్మాగారంలో యజ్ఞం..

కొత్తవలస: మండలంలోని అప్పన్నపాలెం సమీపంలోని జిందాల్ కర్మాగారంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా విరాట్ విశ్వ కర్మ భగవాన్ యజ్ఞం ఆదివారం నిర్వహించారు. కర్మాగార యూనిట్ హెడ్ దినేష్‌శర్మ, డీజీఎం, హెచ్‌ఆర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో కార్మికులు పూజలు చేశారు. కొత్తవలస రైల్వేస్టేషన్ ఆవరణలో ఎలక్ట్రికల్, టెలికమ్యూనికేషన్ డిపార్ట్ మెంట్ల వారు వేర్వేరుగా విశ్వకర్మ విగ్రహాలను ప్రతిష్టించి పూజలు నిర్వహించారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: పట్టణంలోని విశ్వబ్రాహ్మణ కార్పెంటర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతిని ఆదివారం నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటం వద్ద పూజాధికాలు చేశారు.విశ్వకర్మ యోజన పేరుతో 13వేల కోట్ల రూపాయలతో 18 చేతి వృత్తుల వారికి ప్రయోజనం కలిగించే గొప్ప పథకాన్ని ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించడంపై సంఘ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తమ్మిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశ్వకర్మ జయంతిని రాష్ట్ర ప్రభుత్వంగా గుర్తించినందుకు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. పలువురు విశ్వబ్రాహ్మణులు హాజరయ్యారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


పథకాలను మహిళకు వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు గడప గడప కూ వస్తున్నామని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో ఆదివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతీ కుటుంబానికి పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించారు. ఏమైనా సమస్యలున్నాయా అని ప్రజలను ఆరా తీశారు. గ్రామస్తులు చెప్పిన సమస్యలను నమోదు చేసుకుని, రెండు నెలల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్.కోట నియోజకవర్గంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం 266 రోజులు పూర్తయిందని చెప్పారు. గడప గడపకూ వెళ్లి ప్రజాసమస్యలు తెలుసుకున్నామని, ఇప్పటి వరకు తన దృష్టికి వచ్చిన సమస్యల్లో 80 శాతానికి పైగా పరిష్కరించామని వివరించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' పూర్తయిన గ్రామాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించి ఎన్ని సమస్యలు పరిష్కారమయ్యాయి, ఇంకా ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి అనే అంశాలపై అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు తెలిపారు. సీఎం జగన్ నెలకొల్పిన గ్రామసచివాలయ, వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ సచివాలయాల ద్వారా గ్రామాల్లోనే అందుతున్నాయని, వలంటీర్లు ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే తలుపుతట్టి అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ అందజేస్తున్నారని చెప్పారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ నవరత్న పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు ఒబ్బిన నాయుడు, స్థానిక సర్పంచ్ విరోతి కొండలరావు, ఎంపీటీసీ పిల్లా లక్ష్మి, పార్టీ నాయకులు అప్పికొండ సన్యాసిరావు,పెదిరెడ్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు కథనాలు సరికాదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

- చంద్రబాబునాయుడు అరెస్ట్‌లో ప్రభుత్వ కుట్రలేదు
- సీఎం జగన్‌పై అభాండాలు సరికాదు
- ప్రభుత్వంపై నిత్యం బురదజల్లడమే ఎల్లోమీడియా పని
- పవన్ కాపుల పరువు తీస్తున్నాడు- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గజపతినగరం: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడిని అక్రమంగా అరెస్ట్ చేయించారని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై, ప్రభుత్వంపై టీడీపీ అనుకూల పత్రికలు పదేపదే తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నాయని, చానెళ్లలో దుష్ప్రచారం చేస్తున్నాయని, ఇది సరికాదని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని, చంద్రబాబులా కుట్రరాజకీయాలు చేయడం ఆయనకు తెలియదన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడిన చంద్రబాబును సీఐడీ వారు అరెస్టు చేసి, అన్ని సాక్ష్యాలు కోర్టులో చూపించాకే ఆయనకు కోర్టు రిమాండ్ విధించిందని చెప్పారు. ఈ అరెస్టు వ్యవహారంలో సీఎం జగన్‌పై అభాండాలు మోపడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు. పేపర్లు, చానెళ్లు ఉన్నాయి కదా అని ఇష్టానుసారం దుష్ప్రచారం చేస్తామంటే కుదరదని హెచ్చరించారు. చంద్రబాబు ఏదో నీతిమంతుడైనట్లు ఆయన పుత్రుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్ గగ్గోలు పెడుతున్నారని, చంద్రబాబు తప్పు చేయకుంటే కోర్టులో తేల్చుకోవాలని హితవు పలికారు. ములాఖత్ పేరిట జైల్లో చంద్రబాబుతో పవన్ కల్యాణ్ మిలాఖత్ అయ్యారని, బీజేపీతో పొత్తులో ఉన్నామంటూనే టీడీపీతో కాపురం చేస్తూ కాపుల పరువు, ప్రతిష్టను మంటగలుపుతున్నారని మండిపడ్డారు. పవన్‌కు రాజకీయాలు తెలియవని, ఆయనకు తెలిసిందల్లా చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీ తీసుకోవడమేనని అన్నారు. రాష్ట్రంలో గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రూ.8,480 కోట్ల ఖర్చుతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలలను నిర్మిస్తున్నారని, విజయనగరంలో ఇటీవలే మెడికల్ కళాశాలను ప్రారంభించినట్లు చెప్పారు. వేలాది మంది పేదపిల్లలకు వైద్య విద్య చేరువకావడంతో పాటు ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందనున్నాయని తెలిపారు. సీఎం జగన్ ఎన్ని మంచిపనులు చేస్తున్నా అవేమీ ఎల్లో మీడియాకు కనబడటం లేదని, ఆయనపై నిరంతరం బురదజల్లడమే పనిగా పెట్టుకున్నాయని అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు,కుతంత్రాలు చేసినా, ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయమని ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 30వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించనున్నామని, వీటిని అంతా కలిసి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. జెడ్పీటీసీ గార తవుడు, గజపతినగరం, దత్తిరాజేరు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు బూడి వెంకటరావు, రాపాక కృష్ణార్జున, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, తుమికాపల్లి, చిన్న కాద గ్రామాల సర్పంచ్‌లు బెల్లాన త్రినాథరావు,మొరార్జి, సీనియర్ నాయకులు మండల సురేష్, రేగ సురేష్, కర్రి నానాజీ, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు సామంతుల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతినే పూజిద్దాం..

- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉచితంగా మట్టివినాయక ప్రతిమల పంపిణీ

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ), రసాయనాలతో తయారు చేసిన వినాయక విగ్రహాలతో పర్యావరణానికి హాని కలుగుతోందని, వాటిని చెరువులు, నదుల్లో నిమజ్జనం చేయడం వల్ల జలవనరులు కాలుష్యం అవుతున్నాయని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. పర్యావరణ హితం మట్టి వినాయకులను పూజిద్దామని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రజలను చైతన్యవంతం చేస్తున్నారు. గజపతినగరం, చీపురుపల్లి, గరివిడి,గుర్ల, వేపాడ, జామి,ఎస్.కోట మండలాల్లోని పలుగ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఆదివారం అవగాహన కల్పించడంతో పాటు నాయకులతో కలిసి ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

– గజపతినగరం/చీపురుపల్లి/ గుర్ల/వేపాడ/ జామి/ శృంగవరపుకోట/ చీపురుపల్లిరూరల్


చీపురుపల్లి: జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ రామకృష్ణరాజుకు విగ్రహం అందజేస్తున్న యువకులు


చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో దాస్‌మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న కొండపాలెం మేజర్ పంచాయతీ సర్పంచు ప్రమీల


గుర్ల: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గుర్లలో విగ్రహాలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, జనవిజ్ఞాన వేదిక సభ్యులు


శృంగవరపుకోట: భర్తాపురంలో మట్టి గణపతులను పంచుతున్న గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు రామకృష్ణ


చీపురుపల్లిరూరల్ : అలజంగిలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో విగ్రహాలను పంపిణీ చేస్తున్న నాయకులు వలిరెడ్డి శ్రీనివాసరావు,బెల్లాన వంశీకృష్ణ


గజపతినగరం: పురిటిపెంటలో మట్టివినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న వైస్ సర్పంచ్ మండల సురేష్, నాయకుడు రేగ సురేష్ తదితరులు


వేపాడ: బొద్దాంలో గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఆ సంస్థ సభ్యులు


గజపతినగరం: స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గజపతినగరంలో ప్రతిమలను పంపిణీ చేస్తున్న డాక్టర్ అజయ్ కుమార్,తదితరులు



జామి: గణేష్ యూత్ ఆధ్వర్యంలో జామి బీసీ కాలనీలో విగ్రహాలను పంపిణీ చేస్తున్న యూత్


శృంగవరపుకోట: భవానీనగర్‌లోని గౌరీవిద్యానికేతన్‌లో విద్యార్థులకు విగ్రహాలు పంచుతున్న హెచ్‌ఎం వెంకటరాము







